పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్న దృశ్యం

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మైహోం తర్ష్య గేటెడ్ కమ్యూనిటీ సీనియర్ సిటిజన్ గ్రూప్ సభ్యులు మంగళవారం ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. పాఠశాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థినికి వారికి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. గత విద్యాసంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచిన పి. సాయి శ్రావ్య, కె, భూమిక, భాను గౌడ్‌కు ఆర్థిక ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాదవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం సమాజంపై ఉందన్నారు. అలాంటి వారిని ప్రోత్సహిస్తే రాబోయే రోజుల్లో వారు ఎంతో ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు.

అబాకస్‌లో సత్తా


అబాకస్ పోటీలలో రాణించిన విద్యార్థులు

మణికొండ: సిప్ అబాకస్ మెంటల్ అర్థమెటిక్ ప్రాడిజీ-2024 పోటీల్లో మణికొండ కేంద్రం విద్యార్థులు రాణించారు. శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్‌లో జరిగిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మంది విద్యార్థులు పాల్గొనగా మణికొండ సిప్ అబాకస్ కేంద్రం విద్యార్థులు 30 మంది మొదటి, రెండవ, మూడవ బహుమతులను సాధించారని కేంద్రం నిర్వాహకులు శ్రీవాణి, శ్రావణ్ కుమార్ తెలిపారు. వీరితో పాటు ఉత్తమ ప్రతిభ కనబర్చిన మరో 70 మంది విద్యార్థులను అభినందించారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన


పనులపై అధికారులతో మాట్లాడుతున్న లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ సూచించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నిర్మిస్తున్న పైప్‌లైన్ పనులను మంగళవారం ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. త్వరగా పనులను పూర్తి చేసి కొత్తగా నిర్మించిన రిజర్వాయర్‌లకు సరఫరా చేయాలన్నారు. గంధంగూడ, బైరాగిగూడలో నిర్మించిన రిజర్వాయర్‌లకు నీటి కనెక్షన్ అందిస్తే అక్కడి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. నీటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తప్పిపోయిన చిన్నారుల చేరదీత


పోలీసులతో చిన్నారులు

రాజేంద్రనగర్: ఆడుకుంటూ వచ్చి రైల్వే స్టేషన్‌కు చేరుకొని బుద్వేల్ రైల్వే స్టేషన్ వద్ద దిగి రోడ్డుపై ఏడుస్తున్న ఇద్దరు చిన్నారులను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు చేరదీశారు. శంషాబాద్ హుడా కాలనీ ప్రాంతంలో కొందరు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన చిన్నారులు కార్తీక్ (6), చిన్న (4) ఆడుకుంటూ పక్కనే ఉన్న శంషాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలెక్కి బుద్వేల్ స్టేషన్‌లో దిగారు. రోడ్డుపైకి వచ్చి ఏడుస్తుండగా అక్కడే విధుల్లో ఉన్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ కానిస్టేబుళ్ల యాదయ్య, వెంకట్‌రెడ్డి, శివ వారి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు అప్పగించారు.

మూసీ కాలువ సర్వే


కాలువను పరిశీలిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హిమాయత్‌సాగర్ బుద్వేల్ గ్రీన్ సిటీ వరకున్న మూసీ (ఈసీ) కాలువను వివిధ శాఖల అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. కాలువ ఇరువైపులా 50 మీటర్ల చొప్పున మార్క్ చేశారు. హిమాయత్‌సాగర్ నుంచి కిస్మత్‌పూర్, బుద్వేల్ మీదుగా గ్రీన్‌సిటీ వరకు ఈ మార్కింగ్‌ను పూర్తి చేశారు. బుద్వేల్, గ్రీన్‌సిటీ ప్రాంతంలోని ఖాళీ ప్లాట్ల యజమానులతో పాటు నిర్మాణం చేపట్టిన యజమానులు వచ్చి అధికారులకు తమ పత్రాలను చూపించారు. అధికారులు మార్కింగ్ పూర్తి చేసి వారి పత్రాలను స్వీకరించారు. సర్వేలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి గౌతమి, డిప్యూటీ కలెక్టర్ మాలతి, చంద్రకళ, రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు, ఎంఆర్‌డీఏ తహసీల్దార్ చందర్ రావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

కబ్జాలు అడ్డుకోవాలని వినతి

శంషాబాద్: పట్టణంలోని క్రీడా మైదానంలో కొందరు అడ్డగోలుగా కబ్జాలు చేస్తున్నారని బీజేవైఎం నేతలు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. క్రీడా మైదానంలో ఇప్పటికే కొందరు అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేయగా మరికొందరు కబ్జాలను చేపడుతున్నారు. మినీ స్టేడియం, రెండు ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల మైదానం సమీపంలోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వినతి ఇచ్చిన వారిలో వంశీయాద్, వీరేందర్‌రెడ్డి, గాజుల రాహుల్ ఉన్నారు.

జీహెచ్ఎంసీలో విలీనమా..?

- కార్పొరేషన్‌లో జోరుగా చర్చలు
- రాజకీయ భవిష్యత్తుకు చెక్
- నాయకుల ఆందోళన



బండ్లగూడ: ప్రస్తుత కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఎన్నికైన సంస్థల పదవీకాలం ఆరు నెలలు ఉండటంతో పూర్తయిన వెంటనే హెచ్ఎండీఏ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేయాలని ప్రభుత్వం భావిస్తుందా.. దీనిపై చట్టపరమైన సవాళ్లను నివారించి, విలీన ప్రక్రియను సజావుగా జరిగేలా అధ్యయనం చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మున్సిపల్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విలీనంపై కార్పొరేషన్ జోరుగా చర్చలు జరుగుతున్న తరుణంలో జీహెచ్ఎంసీలో విలీనంపై బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు అభ్యంతరం తెలుపుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గతంలో ఐదు గ్రామ పంచాయతీలు విలీనం చేసి..

గతంలో గ్రామ పంచాయతీల పదవీకాలం పూర్తయిన తర్వాత బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హిమాయత్ సాగర్, హైదర్‌షాకోట్, పీరంచెరువు 5 గ్రామ పంచాయతీలను 2019 జూలైలో విలీనం చేసి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 22 డివిజన్లకు కార్పొరేటర్లుగా ఎన్నికైన వారు ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నారు. బండ్లగూడ జాగీర్‌లో ప్రస్తుతం 1.50 లక్షల జనాభా ఉన్నట్లుగా అంచనా. 35,159 నివాస గృహాలు ఉండగా 200 కాలనీలు ఏర్పడ్డాయి. కార్పొరేషన్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే ఓటర్ల సంఖ్య ఆధారంగా రెండు జీహెచ్ఎంసీ కార్పొరేటర్ డివిజన్లుగా మారేందుకు అవకాశం ఉంటుంది.

అభివృద్ధి పుంజుకుంటున్న తరుణంలో..

రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పరిధిలోకి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను విలీనం చేయాలనుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కు కుంటున్న బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో వీధిదీపాలు, పారిశుద్ధ్యం, మంచినీరు, రహదారులు, మురుగునీరు వ్యవస్థ, పార్కులు ఏర్పాటు తదితర అవసరాలతో అభివృద్ధి మేరుగు పడుతున్న తరుణంలో జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో ప్రజలకు ప్రజాప్రతినిధులకు దూరం పెరిగి అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే నిర్ణయం తీసుకోవాలి



జీహెచ్ఎంసీ పరిధిని పెంచాలనే ప్రభుత్వ ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. విలీనం చేస్తే నగర శివారు ప్రాంతాల అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. విలీనంపై ప్రజల అభిప్రాయసేకరణ అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

–బొర్రా రాందాస్ ముదిరాజ్,
బండ్లగూడ జాగీర్ పీఏసీఎస్ చైర్మన్

రథయాత్రను ఘనంగా నిర్వహించుకోవాలి


అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం నుంచి జరుగనున్న పూరీ జగన్నాథ రథయాత్రలో భాగంగా కాలనీల్లో చెత్తా, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులను డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం హౌసింగ్ బోర్డు కాలనీ, బృందావన్ కాలనీల్లో పర్యటిస్తూ మాట్లాడారు. 15 రోజుల పాటు పూరీ జగన్నాథ రథయాత్ర జరుగుతుందని, అందులో భాగంగా అన్నదానం, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. శానిటేషన్ సిబ్బంది ప్రతి రోజు రోడ్లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రాత్రి సమయంలో స్ట్రీట్ లైట్లు వెలిగేలా చూడాలని విద్యుత్ సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, మున్న, సరోజ్, గిరిధర్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న గాజుల రాహుల్

శంషాబాద్: శంషాబాద్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు గాజుల రాహుల్‌ను ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన లక్ష్మీనారాయణతో పాటు పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు చింతల నందకిశోర్, పట్టణ అధ్యక్షుడు దేవేందర్‌కు కృతజ్ఞతలని పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వంశీయాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

నవ వధువు ఆత్మహత్యాయత్నం


రేణుక పెళ్లినాటి ఫొటో

మణికొండ: భర్త వేధింపులు తాళలేక నవ వధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా రాంపూర్‌కు చెందిన రేణుకను అదే జిల్లా ఊట్కూరుకు చెందిన ప్రవీణ్‌కిచ్చి మూడు నెలల క్రితం వివాహం చేశారు. ప్రవీణ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ హైదర్‌షాకోట్‌లోని సన్‌సిటీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. పెళ్లయినప్పటి నుంచి ప్రవీణ్ భార్యను వేధించేవాడు. దీంతో ఇటీవల రేణుక పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లితండ్రులు నచ్చచెప్పి తిరిగి ఆమెను భర్త వద్దకు పంపారు. అయినా ప్రవీణ్ వేధింపులు ఆపలేదు. మళ్లీ తల్లితండ్రులకు తెలపడంతో సోమవారం ఇరువురి తల్లితండ్రులు కూర్చుని ప్రవీణ్‌కు నచ్చజెప్పారు. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో మంగళవారం మూడంస్తుల భవనంపై నుంచి రేణుక దూకడంతో తీవ్రంగా గాయపడటంతో హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తలకు గాయం కావటంతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

దృష్టిలోపం ఉన్న వారికి చేయూత అందించాలి


నిర్వాహకులతో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్

రాయదుర్గం: దృష్టిలోపం ఉన్న వారికి చేయూత అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో మంగళవారం ఆయన ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ ఆధ్వర్యంలో 'డైలాగ్ ఇన్ ది డార్క్' పేరిట ప్రత్యేక ప్రదర్శన, దివ్యాంగుల సామర్థ్యాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చూపు లేని వారికి వినికిడి, వాసన గమనించడం, రుచి, స్పర్శ ద్వారా వారి పని తీరు మనకంటే రెండు రెట్లు ఎక్కువగా ఉంటుందన్నారు. 12 ఏళ్లుగా క్రమం తప్పకుండా డైలాగ్ ఇన్ ద డార్క్ పేరిట సమావేశాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫ్రీడమ్స్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ తయారీదారులు, జెమినీ ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ ఉపాధ్యక్షుడు అక్షయ్‌చౌదరి మాట్లాడుతూ డైలాగ్ ఇన్ ది డార్క్ కార్యక్రమం ద్వారా టీహబ్‌తో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. జెమిని ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ ఉపాధ్యక్షుడు చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న వ్యక్తుల కోణం నుంచి ప్రపంచాన్ని అర్థం చేసుకోవ డానికి సమాజానికి ఒక అవకాశాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, బిజినెస్ లీడర్లు, డీఈఐహెడ్‌లు, హెచ్ఆర్ ప్రాక్టీషనర్లు పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో 'మెట్టుమెట్టుకు బొట్టు'



గోల్కొండ: గోల్కొండ కోటలో వచ్చే వారం ప్రారంభం కానున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు ముందు కోటలోని నగీనాబాగ్ నుంచి అమ్మవారి ఆలయం వరకు గల మెట్లకు బొట్టు పెడతారు. ఇందులో భాగంగా అమ్మవారి వృత్తిపని సంఘం వారితో పాటు కోట పరిసరాలకు చెందిన మహిళలు 'మెట్టుమెట్టుకు బొట్టు'కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మంగళవారం నుంచి మెట్లను శుభ్రపరిచి మెట్టు మెట్టుకూ బొట్టు పెట్టే కార్యక్రమం ప్రారంభమైంది. వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

జాతీయ రహదారిలో రెండు కార్లు ఢీ..

ఇద్దరికి గాయాలు

జియాగూడ: పురానాపూల్ 100 ఫీట్ల జాతీయ రహదారిలో ఎదురెదురు వచ్చిన రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం..పోలీస్‌స్టేషన్ పరిధిలోని 100 ఫీట్ల జాతీయ రహదారిలో సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో కర్ణాటక యాద్గిర్‌కు చెందిన సాహెల్ (23) విద్యార్థి, కొత్తగూడెంకు చెందిన హస్రత్(27) ట్యాక్సీ డ్రైవర్. స్థానిక ఎస్‌బీఏ గార్డెన్‌లో ఫంక్షన్‌కు హాజరై పురానాపూల్ వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న సాహెల్ కారును ఢీకొట్టాడు. దీంతో రెండు కార్లు కొంతమేరకు ధ్వంసం కాగా ఇరువురికి గాయాలయ్యాయి. ఈ రహదారిలో రెండేళ్ల నుంచి పైప్‌లైన్ నిర్మాణం పనులు కొనసాగుతుండగా సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

దూద్‌బౌలి: పేదల వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందజేస్తున్నదని రాష్ట్ర వైద్య ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్ అన్నారు. మంగళవారం ఆయన పేట్ల బురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని సందర్శించి ఇక్కడ జరుగుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని కొన్ని వార్డులను సందర్శించిన ఆయన చికిత్స పొందుతున్న కొంత మంది రోగులను పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్య సేవలను అందజేయడంలో సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఆయనతో పాటు జాయింట్ డైరెక్టర్లు డాక్టర్ పద్మజ, డాక్టర్ సుధీర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజనీరెడ్డి తదితరులున్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

గోల్కొండ: మజ్లిస్ విజయం ప్రజా విజయమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా మంగళవారం ఆయన గురుమిట్కల్‌లోని సయ్యద్ షా మత్‌వాలే హుసేనీ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ స్థానం నుంచి గెలిచిన అసదుద్దీన్ ఒవైసీ తన సెక్యులర్ విధానాలతో ప్రజల ఆదరణ పొందారన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న మజ్లిస్ పార్టీ ఎప్పుడూ బీసీలు, దళితులకు అండగా ఉంటూ వస్తుందన్నారు. ఆయన వెంట దూద్‌బౌలి కార్పొరేటర్ మహ్మద్ సలీం, మజ్లిస్ నాయకులు టకీచాంద్ పీర్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి


నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న చైర్ పర్సన్, కమిషనర్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ఖానాపూర్‌లో కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డితో కలిసి పర్యటించి ప్రభుత్వ పాఠశాల ప్రహరీ, మూత్రశాలలు, అంగన్‌వాడీ పాఠశాల, కమ్యూనిటీహాళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న పనులు నాణ్యతతో ఉండి దశాబ్దాల పాటు మన్నిక ఉండేలా చేయాలన్నారు. నాసిరకం పనులు చేపడితే చర్యలు తప్పవన్నారు. గ్రామంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి వార్డు పరిధిలో ఎక్కడా వ్యర్థాలు ఉండరాదన్నారు. గ్రామంలో ఉన్న బుల్కాపూర్ నాలా ఆక్రమణ కాకుండా పరిరక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం, ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ స్థలంలోని కంటైనర్ తొలగింపు


కంటైనర్‌ను తొలగిస్తున్న సిబ్బంది


పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రహమత్ బేగ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ ప్రాంతంలోని జీహెచ్ఎంసీ స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్‌ను మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు తొలగించి ఆ స్థలంలో బోర్డు ఏర్పాటు చేశారు. గోల్డెన్ హైట్స్ కాలనీ ఏర్పాటు సమయంలో 200 గజాల స్థలాన్ని సెప్టిక్ ట్యాంక్ కోసం వదిలారు. గత రెండు రోజుల క్రితం ఈ స్థలాన్ని కొందరు చదును చేసి సోమవారం కంటైనర్‌ను ఏర్పాటు చేశారు. గోల్డెన్ హైట్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పోలీసులతో పాటు జీహెచ్ఎంసీ అధికారులు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ అబ్దుల్ ఖాదర్, ఇంజినీరింగ్ విభాగం ఏఈ వెంకోబా, ఇతర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజేంద్రనగర్ పోలీసుల బందోబస్తు మధ్య కంటైనర్‌ను తొలగించారు. కంటైనర్ తొలగింపు సమయంలో అధికారులు, కబ్జాదారులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు సముదాయించి వారిని అక్కడి నుంచి పంపించారు. అనంతరం జీహెచ్ఎంసీ సిబ్బంది స్థలంలో జీహెచ్ఎంసీ బోర్డును ఏర్పాటు చేశారు. సమాచారంఅందుకున్న ఎమ్మెల్సీ రహమత్ బేగ్ ఘటనా స్థలాన్ని సందర్శించి కాలనీవాసులు, కబ్జాదారులతో మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఖాదర్ తమ స్థలంగా మొత్తం దస్తావేజులను చూపించగా ఇది జీహెచ్ఎంసీకి సంబంధించిన స్థలమని కబ్జాదారులకు స్థలాన్ని ఎవరూ విక్రయించారో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మణికొండ: రాబోయే సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, కలరా లాంటి వ్యాధులను అరికట్టి వాటి బారి నుంచి ప్రజలు ఆరోగ్యాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన మున్సిపల్, ఆరోగ్య శాఖలకు చెందిన సిబ్బంది, అధికారుల సమావేశంలో నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంటుందని మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఇప్పటికే సంపూర్ణ పారిశుద్ధ్య పనులను చేపడుతున్నామన్నారు. వర్షాలతో కొత్తగా వచ్చే నీటిలో అనేక మలినాలు కలిసి తాగునీటిలో వస్తాయి కాబట్టి ఆ నీటిని కాచి వడపోసి తాగాలని సూచించారు. అనారోగ్యాలకు గురైతే వెంటనే ఆసుపత్రులకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి శ్రీనివాస్, ఎంపీహెచ్ఓ, పీహెచ్ఎన్, మున్సిపల్ మేనేజర్ యోగేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర యువ మోర్చా మీడియా కోఆర్డినేటర్ కిరణ్‌చారి కోరారు. మంగళవారం బీజేవైఎం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు రాకేశ్ గౌడ్ అధ్యక్షతన రాజేంద్రనగర్ అసెంబ్లీ యువ మోర్చా నాయకులతో కలిసి రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌చారి మాట్లాడుతూ.. హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఎనిమిది నెలలైనా యువతను పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ, పోలీసు కానిస్టేబుల్ నియామకాల పరీక్షలు వెంటనే నిర్వహించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామన్నారు. వినతి ఇచ్చిన వారిలో మల్లేష్ యాదవ్, బాల్‌రెడ్డి, విజయ్ కుమార్, నవీన్, వినయ్ రెడ్డి, పాండు యాదవ్, సాయి యాదవ్, బాలకృష్ణ, రాహుల్ రెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేయాలి

చార్మినార్: విద్యార్థులు కాలాన్ని వృథా చేసుకోకుండా ఉన్నత విద్యాభ్యాసం వైపు దృష్టి సారించాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అన్నారు. శక్తి గణపతి ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన కమిటీ మాజీ చైర్మన్లు పొటేల్ సదానంద్ యాదవ్, రాకేష్ తివారి, కమిటీ ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ తదితరులతో కలిసి హాజరై నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్ అందజేశారు.

చదరంగంలో చిచ్చర పిడుగు


శివాంషికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



అత్తాపూర్: రాష్ట్ర చెస్ సెలక్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని లాల్ బహదూర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్-17 చెస్ పోటీల్లో శివాంషిక సత్తా చాటింది. రాజేంద్రనగర్ అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శివాంషిక చిన్నప్పటి నుంచే చెస్‌పై ఆసక్తి చూపేదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. 2022లో భువనేశ్వర్, 2023 చెన్నై, 2024 తెలంగాణ, ఇటీవల పాట్నాలో జరిగిన పోటీల్లోనూ తమదైన శైలిలో ఆడి ప్రతిభ చాటింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివాంషికను ఉపాధ్యాయులు అభినందించారు. బీద కుటుంబం నుంచి వచ్చిన శివాంషిక అత్తాపూర్ పాఠశాలలో విద్యను అభ్యసించడం తమకెంతో గర్వంగా ఉందని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత తెలిపారు. క్రీడారంగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన శివాంషిక తల్లి భవానీ, ఎంఎస్‌సీ పూర్తి చేసిన తండ్రి సతీష్ గౌడ్ వరంగల్ జిల్లాలో అంబులెన్స్‌లో గత కొన్ని సంవత్సరాలుగా సేవలు చేస్తూ నామమాత్రం జీతాలతో తన కూతురు కోసం అహర్నిశలు కష్టపడుతున్నాడు. ఇలాంటి క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి చేయూతనిస్తే మరిన్ని విజయాలు సాధిస్తారని ఉపాధ్యాయులు వెల్లడించారు.